www.aakshitha.com
People's voice
అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY
తెలంగాణ దిక్సూచి
శుక్రవారం | 04 | సెప్టెంబర్ | 2026 | పేజీలు: 08

# పకడ్బందీగా రీసర్వే

## రెవెన్యూ అంశాలపై తహసీల్దార్లు పూర్తి అవగాహనతో సిద్ధంగా ఉండాలి

## కలెక్టర్ ఖుష్బూ గుప్తా



**మహబూబ్ నగర్, అక్షిత ప్రతినిధి:** జిల్లాలో కొనసాగుతున్న రెవెన్యూ కార్యక్రమాలను తహసీల్దార్లు సమర్థవంతంగా పర్యవేక్షిస్తూ, తమ మండలానికి సంబంధించిన ప్రతి అంశంపై తాజా గణాంకాలు, వాస్తవాలతో పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మండల తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమావేశంలో భూభారతి, సాదాబైనామా, రీసర్వే, నక్షా సర్వే, మీ-సేవా, ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్‌రూమ్ ..మిగతా 2లో

# లోటు పాట్లు ఉండొద్దు

## సీఎం పర్యటనకు ఏర్పాట్లు కలెక్టర్ చంద్ర శేఖర్



**నల్గొండ, అక్షిత ప్రతినిధి:** రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నకిరేకల్ పర్యటన ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. గురువారం అయన నకిరేకల్ పట్టణంలో ముఖ్యమంత్రి రాక ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈనెల 5న రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నకిరేకల్ పట్టణంలో నూతనంగా నిర్మించిన ప్రాంతీయ వైద్యశాలను ప్రారంభించనున్నారు. అంతేకాక యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల, తెలంగాణ పబ్లిక్ స్కూల్, ఇంటిగ్రేటెడ్ మండల్ ఆఫీస్ కాంప్లెక్స్, అలాగే వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. ప్రాంతీయ వైద్యశాలలో ప్రారంభోత్సవ ఏర్పాట్లను, శిలాఫలకం ఏర్పాటు చేయాలని, ఆస్పత్రి ఆవరణ మొత్తం పరిశుభ్రంగా ఉంచాలని, ఆస్పత్రిలో లైటింగ్ తో పాటు, పూలతో డెకరేషన్ చేయించాలని, బిల్డింగ్ మొత్తాన్ని ఆటోమేటిక్ బల్బుల ద్వారా విద్యుత్ దీపాలతో అలంకరించాలని కలెక్టర్ ..మిగతా 2లో



# ఎందుకేడ్చిందో అంతు పట్టట్లే ?

### అశ్విని మృతిపై అన్ని కోణాల్లో దర్యాప్తు

### అశ్విని వ్యక్తిగతం మాతో షేర్ చేయలే

### అనారోగ్య సమస్యలతో బాధపడేది

### ఆత్మహత్యకు ముందు ఏడ్చుకుంటూ వెళ్లింది

### గురుకులంలో ప్రిన్సిపల్, ఇతర సిబ్బంది తిట్టలేదు.. విద్యార్థినుల వెల్లడి

### షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ

### పాఠశాలను సందర్శించిన మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు, సిపిఎం నేత రాజు



**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి:** కమ్మదనం ప్రభుత్వ గురుకుల పాఠశాలలో మృతి చెందిన విద్యార్థిని ముడావత్ అశ్విని తమతో చక్కగా మాట్లాడేదని, సంతోషంగా ఉండేదని తోటి విద్యార్థినులు తెలిపారు. అయితే ఆమె తన వ్యక్తిగత విషయాలను ఎవరితోనూ పంచుకునేది కాదని చెప్పారు. అశ్విని మృతికి గల కారణాలు తమకు పూర్తిగా తెలియవని, అయితే ఆత్మహత్యకు ముందు ఆమె ఏడ్చుకుంటూ డార్మెటరీ వైపు వెళ్లడాన్ని కొందరు విద్యార్థినులు చూశారని వెల్లడించారు. గురువారం కమ్మదనం ..మిగతా 2లో

# పదవులు పంచేది అధిష్టానమే

### నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు తోడుంటా

### కాంగ్రెస్ కార్యకర్తల గురించే నా ఆలోచన

### అధిష్టానం నిర్ణయమే శిరోధార్యం

### కొండ సురేఖ అంశం... అధిష్టానం నిర్ణయమే ఫైనల్

### ట్రిబుల్ ఆర్ కింద భూములు కోల్పోతున్న రైతులకు ఎక్కువ నష్టపరిహారం చెల్లించేలా చొరవ తీసుకున్న

### పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలో కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

2





# శరవేగంగా ప్రగతి పనులు

## జిల్లా కలెక్టర్ కె.హరిత

**ఆసిఫాబాద్, అక్షిత బ్యూరో:** జిల్లాలో వివిధ పథకాల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ ..మిగతా 2లో

## పకడ్బందీగా రీసర్వే

**మొదటి పేజీ తరువాయి...**

ఇళ్ల కేటాయింపు, 22ఏ భూములు తదితర రెవెన్యూ అంశాలపై కలెక్టర్ సమగ్రంగా సమీక్షించారు. రెవెన్యూ సేవలకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించి, ప్రజలకు నిర్ణీత గడువులో సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా భూభారతి పోర్టల్‌లో 60 రోజులకు పైగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్లను ఆదేశించారు. పెండింగ్ ఫైళ్లపై నిరంతరం ఫాలోఅప్ చేయడంతో పాటు, కోర్టు కేసులకు సంబంధించిన నివేదికలను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పూర్తి వివరాలతో సమర్పించాలని సూచించారు. సాదాబైనామా దరఖాస్తులను కూడా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించిన కలెక్టర్, సాంకేతిక కారణాలతో పెండింగ్‌లో ఉన్న కేసులను లిఖితపూర్వకంగా జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ప్రతి మండలంలో అనవసర పెండెన్సీ లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.

**రీసర్వే పనులు వేగవంతం చేయాలి**

జిల్లాలో కొనసాగుతున్న గ్రామాల రీసర్వే పనులను వేగవంతం చేసి, గ్రామ సరిహద్దుల నిర్ధారణ, ప్రభుత్వ భూముల డిమార్కేషన్‌ను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రాబోయే దశల కోసం ముందస్తుగా గ్రామసభలు నిర్వహించి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని, శిక్షణ పొందిన సిబ్బందిని రీసర్వే బృందాలతో సమన్వయం చేయాలని సూచించారు. అవసరమైతే అదనపు లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలను వినియోగించి పనులను వేగవంతం చేయాలని తెలిపారు. 22ఏ కింద ఉన్న భూముల విషయంలో వ్యవసాయ, వ్యవసాయేతర భూములను స్పష్టంగా గుర్తించి, పెండింగ్ ఫైళ్లను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్యంగా వ్యవసాయేతర భూములకు సంబంధించిన డీనోటిఫికేషన్, భూమి స్వభావ మార్పు తదితర అంశాలపై ఫైళ్లను 60 రోజుల పాటు పెండింగ్‌లో ఉంచకుండా ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అసైన్డ్ భూముల విషయంలో నిబంధనల ప్రకారం పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

## లోటు పాట్లు ఉండొద్దు



**మొదటి పేజీ తరువాయి...**

ఆదేశించారు. అంతేకాక రాష్ట్ర ముఖ్యమంత్రి ఆస్పత్రిలో ప్రారంభించే వివిధ విభాగాలను కూడా సిద్ధం చేసి ఉంచాలని, సూపరింటీండెంట్ గదితో పాటు, ఆస్పత్రిలోని అన్ని విభాగాలు, టాయిలెట్లు, లిఫ్ట్, ఆపరేషన్ థియేటర్లు ,వార్డులు, ప్రతీ విభాగాన్ని ముందే శుభ్రపరచి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆస్పత్రిలో స్టాండ్ బై జనరేటర్ కూడా సిద్ధంగా ఉంచాలని డిసిహెచ్ఎస్ మాతృ నాయక్, సూపరింటెండెంట్ శోభ రాణిలను ఆదేశించారు. అనంతరం పక్కనే ఉన్న స్టేడియం గ్రౌండ్లో ఏర్పాటు చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరుకానున్న బహిరంగ సభ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పర్యవేక్షించారు. సభా వేదిక ,వాహనాల పార్కింగ్ ,వివిధ అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన లు, ప్రారంభోత్సవాలకు ఏర్పాటు చేసే శిలాఫలకాలు, బ్యారికేడింగ్, బహిరంగ సభ కు హాజరయ్యే ప్రజా ప్రతినిధులు,అధికారులు, ప్రజలకు అవసరమైన ఏర్పాట్లు, కుర్చీలు, టెంట్లు, తాగునీరు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తిచేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఆ తర్వాత జిల్లా కలెక్టర్ వివిఎం పాఠశాల గ్రౌండ్లో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ ఏర్పాట్లను కూడా పరిశీలించారు. సాధ్యమైనంత త్వరగా హెలిప్యాడ్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. వివి ఏం పాఠశాల గ్రౌండ్లో డబుల్ బ్యారికెడింగ్ తో పాటు ,లైటింగ్, గ్రీన్ రూమ్ ఏర్పాట్లను చేయాలని, ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఆదేశించారు. స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ మాతృనాయక్, ఆర్ అండ్ బి ఎస్ ఈ పున్నమోహన్, ఈఈ శ్రీధర్ రెడ్డి ,మున్సిపల్ కమిషనర్ సతీష్, తహసిల్దార్ యశ్వంత్, పోలీసు, రెవెన్యూ, ఫైర్, ఎక్సైజ్, శాఖల అధికారులు, తదితరులు ఉన్నారు.

# ఎందుకేడ్చిందో అంతు పట్టట్లే ?

**మొదటి పేజీ తరువాయి...**

గురుకుల పాఠశాల ఎదుట గిరిజన, విద్యార్థి సంఘాల నాయకులు ధర్నా నిర్వహించిన నేపథ్యంలో పోలీసులు కొంతమంది నాయకులకు గురుకుల విద్యార్థినులతో మాట్లాడేందుకు అవకాశం కల్పించారు. షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో గురుకుల పాఠశాల వద్ద పెద్ద ఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పట్టణ సీఐ సీతారాం తదితర పోలీసు అధికారులు విద్యార్థి సంఘాల నాయకులు విద్యార్థినులతో మాట్లాడేందుకు అవకాశం కల్పించారు. అశ్విని మృతి చెందిన తీరుపై ఎల్‌హెచ్‌పీఎస్ నాయకుడు రాంబాబు నాయక్, బీఆర్ఎస్ నాయకుడు, మాజీ చైర్మన్ వాల్యా నాయక్, ఏబీవీపీ నాయకుడు పుట్నాల సాయికుమార్, ఎస్ఎఫ్ఐ నాయకుడు వడ్ల శ్రీకాంత్, జనసేన నాయకుడు రాజు నాయక్ తదితరులు విద్యార్థినులతో మాట్లాడారు. ఆత్మహత్యకు ముందు, ఆ తర్వాత చోటుచేసుకున్న పరిణామాలపై విద్యార్థినులను పలు ప్రశ్నలు అడిగి వివరాలు తెలుసుకున్నారు.



ఈ సందర్భంగా పలువురు విద్యార్థినులు అశ్విని గురించి మాట్లాడుతూ ఆమె తన వ్యక్తిగత విషయాలను ఎవరితోనూ షేర్ చేసేది కాదని తెలిపారు. తన అక్క విషయంలో మాత్రం బాధపడేదని చెప్పారు. అశ్విని గతంలో కొన్ని అనారోగ్య సమస్యలను ఎదుర్కొందని, ముఖ్యంగా కడుపు నొప్పితో తీవ్రంగా బాధపడేదని, చిన్న సర్జరీ కూడా జరిగిందని విద్యార్థినులు తెలిపారు. చదువుల్లో హుషారుగా ఉండేందుకు ఆమె ప్రయత్నించేదని పేర్కొన్నారు. అశ్విని ఆత్మహత్య చేసుకున్న రోజు సాయంత్రం నాలుగు గంటల వరకు తమతోపాటే ఉందని, పరీక్ష కూడా రాసిందని విద్యార్థినులు తెలిపారు. పరీక్షలో ఎన్ని మార్కులు వచ్చాయనే విషయం తమకు తెలియదని చెప్పారు. అనంతరం అశ్విని బయటకు వెళ్లిందని, గ్రౌండ్‌లో ఏడ్చుకుంటూ డార్మెటరీ వైపు వెళ్లిందని పదో తరగతి విద్యార్థినులు చూశారని తమకు తెలిసిందని తెలిపారు. అశ్విని ఎందుకు ఏడ్చిందో, దేనికి బాధపడిందో తమకు పూర్తిగా తెలియదని విద్యార్థినులు చెప్పారు. అయితే గురుకులంలో ప్రిన్సిపల్ కానీ, టీచర్లు కానీ అశ్వినిని వేధించలేదని, తిట్టలేదని వారు స్పష్టం చేశారు. అశ్విని మృతికి సంబంధించి విద్యార్థి సంఘాల నాయకులు, కుటుంబ సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు విద్యార్థినులు సమాధానాలు ఇచ్చారు. అశ్విని మృతి అనంతరం జరిగిన పరిణామాలపై ఆమె బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనకు సంబంధించిన పరిణామాలను తెలుసుకున్న బంధువులు, జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే దృశ్య సినిమాల్లో కనిపించే సన్నివేశాలను తలపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అశ్విని మృతికి అసలు కారణాలు వెలుగులోకి రావాలని, అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు జరపాలని వారు డిమాండ్ చేశారు.

**అన్ని కోణాల్లో దర్యాప్తు ఏసీపీ లక్ష్మీనారాయణ**

విద్యార్థి సంఘాలు, గిరిజన నాయకులతో షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ మాట్లాడారు. విద్యార్థి సంఘాలు, విద్యార్థులు, అధ్యాపకులు లేవనెత్తిన అంశాలన్నింటినీ పోలీసులు పరిగణనలోకి తీసుకుంటారని ఆయన తెలిపారు. అశ్విని మృతిపై బంధువులు చేసిన ఫిర్యాదులను కూడా స్వీకరించి, వాటి ఆధారంగా పూర్తిస్థాయిలో విచారణ జరుపుతామని స్పష్టం చేశారు. అశ్విని మృతి ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తామని ఏసీపీ తెలిపారు. పోస్టుమార్టం నివేదిక కూడా రానుందని, దాని ఆధారంగా నిష్పక్షపాతంగా విచారణ కొనసాగిస్తామని చెప్పారు. ఘటనలో ఎవరి ప్రమేయం ఉన్నా, ఇతర కారణాలు ఏవైనా వెలుగులోకి వచ్చినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గురుకులంలో చదువుకుంటున్న మిగతా విద్యార్థులు ధైర్యంగా ఉండి, తమ చదువును కొనసాగించేలా అన్ని వర్గాలు సహకరించాలని ఏసీపీ లక్ష్మీనారాయణ విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల భద్రత, వారి మానసిక స్థైర్యానికి అన్ని వర్గాలు అండగా నిలవాలని కోరారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు, సిపిఎం నేతలు రాజు నాయక్ ఈశ్వర్ నాయక్ శ్రీను నాయక్ తదితరులు పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు సంఘటనపై ఆరా తీశారు.

## పదవులు పంచేది అధిష్టానమే



**పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలో కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి**

**చౌటుప్పల్/అక్షిత న్యూస్ :** నిజమైన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అన్యాయం జరగొద్దని, నిజమైన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల గురించే తన ఆలోచనని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా, మునుగోడు నియోజకవర్గం, నారాయణపూర్ మండలం సర్వేల్ గ్రామంలో 76.20 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేయనున్న రోడ్లకు ఆయన చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. నారాయణపూర్ మండలం గుడిమల్కాపూర్ నుండి చల్మెడ వయా సర్వేల్, లింగం వారి గూడెం, సాయిగోని బావి వరకు 32.90 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించబోయే డబుల్ రోడ్డు అభివృద్ధి పనులకు, నారాయణపూర్ నుండి సర్వేల్ వరకు 5 కిలోమీటర్లు మేర 11 కోట్ల రూపాయల వ్యయంతో అభివృద్ధి చేయనున్న రోడ్డు నిర్మాణ పనులకు,, సర్వేల్ నుండి మునుగోడు మండలం పలివెల వయా మల్లారెడ్డిగూడెం వరకు 32.30 కోట్ల వ్యయంతో నిర్మించే రోడ్డు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేయడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ..గ్రామాల నుండి గ్రామాలకు వెళ్లే రోడ్లన్నీ కూడా 3.75 మీటర్ల వెడల్పుతో ఉండేవని రవాణా సౌకర్యాలు మెరుగై ప్రతి గ్రామంలోకి కార్లు బైకులు బస్సులు వస్తున్న నేపథ్యంలో ఆ రోడ్లని 5.5 మీటర్ల వెడల్పు చేయాలనే ఆలోచనను తానే ప్రభుత్వానికి విన్నవించడంతో ప్రజా ప్రభుత్వం వెంటనే స్పందించడంతో మునుగోడు నియోజకవర్గంలో 5.5 మీటర్ల వెడల్పుతో రోడ్లను అభివృద్ధి చేసుకుంటున్నామన్నారు. తాను ఎక్కడ మాట్లాడినా కూడా పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు అన్యాయం జరుగొద్దనేది తన ఆలోచన అని, కష్టపడ్డ కార్యకర్తలకు ఆదుకోవాలని అన్నారు. ట్రిబుల్ ఆర్ కింద భూములు కోల్పోతున్న రైతులకు ఎక్కువ నష్టపరిహారం చెల్లించేలా తాను చొరవ తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు,వివిధ గ్రామాల సర్పంచులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శరవేగంగా ప్రగతి పనులు

**మొదటి పేజీ తరువాయి...**



మందిరంలో సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ– ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి మంద మకరందు, జిల్లా అటవీ అధికారి బాలమణి, కాగజ్ నగర్, ఆసిఫాబాద్ డివిజన్ అటవీ అధికారులు భార్గవ్, అప్పయ్య లతో కలిసి జిల్లాలో వివిధ శాఖల ద్వారా చేపడుతున్న పనులు, అటవీశాఖ అనుమతుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూముల రీ సర్వేలో రెవెన్యూ, అటవీ శాఖల మధ్య వివాదాలు గల భూములను జాయింట్ సర్వే నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో చేయబడుతున్న ఇందిరమ్మ ఇండ్లు, ప్రధానమంత్రి జన్ మన్ పథకం క్రింద మంజూరైన ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని, అటవీ అధికారులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. టి.డబ్ల్యు.ఐ.డి.సి. ఆధ్వర్యంలో లింగాపూర్ మండలంలో కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ప్రహరీ గోడ నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని, గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పలు మండలాలలో బిటి రహదారులు, వంతెనలు, కల్వర్టు పనులు మంజూరయ్యాయని, సంబంధిత అటవీ శాఖ అనుమతులు త్వరగా పొంది పనులు చేపట్టాలని తెలిపారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో చేపడుతున్న రహదారులు, గ్రామపంచాయతీ భవనాలు, మండల సమాఖ్య భవనాలు, సిసి రహదారుల పనులు త్వరగా చేపట్టాలని తెలిపారు. బిఎస్ఎన్ఎల్, జియో సంస్థల సెల్ టవర్ల నిర్మాణాల కొరకు అవసరమైన అనుమతులు పొంది పనులు వేగవంతంగా పూర్తి చేసి నెట్వర్క్ సేవలను మారుమూల గ్రామాలకు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. అభివృద్ధి పనులలో అవసరమైన చోట అటవీ శాఖ అనుమతులు త్వరగా పొంది పనులు పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పి.డి. ప్రకాష్ రావు, పంచాయితీ రాజ్ ఈ ఈ ధర్మేందర్, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, నీటిపారుదుల, రహదారి భవనాలు, గిరిజన సంక్షేమ శాఖల అధికారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY



# వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో ఆధునికీకరించిన అడిక్షన్ ట్రీట్మెంట్ ఫెసిలిటీ కేంద్రం ప్రారంభం



**వరంగల్, అక్షిత బ్యూరో:** మత్తు పదార్థాలకు బానిసలై తమ భవిష్యత్తును అంధకారంలోకి నెట్టుకుంటున్న యువతను తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావాలనే లక్ష్యంతో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో నూతనంగా ఆధునికీకరించిన అడిక్షన్ ట్రీట్మెంట్ ఫెసిలిటీ కేంద్రాన్ని ఈగల్ ఫోర్స్ వారి సహకారంతో ఏర్పాటు చేయడం జరిగింది. మద్యం, పొగాకు, గంజాయి ఇతర మాదకద్రవ్యాల వ్యసనం నేడు యువతతో పాటు వారి కుటుంబాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్న ప్రధాన సామాజిక సమస్యగా మారింది. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, నిల్వ విక్రయాలపై డ్రగ్స్ కంట్రోల్ టీమ్ ఆధ్వర్యంలో కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతోంది. అదే సమయంలో మత్తు పదార్థాలకు బానిసలైన యువతను శిక్షించడం మాత్రమే కాకుండా, వారిని వ్యసన విముక్తి చేసి తిరిగి ఆరోగ్యకరమైన జీవితంలోకి తీసుకురావడానికి ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతోంది. నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా, జి.ఓ. ఎం.ఎస్. నెం.4, 10-02-2026 ప్రకారం ఎంజీఎం ఆసుపత్రిలో అడిక్షన్ ట్రీట్మెంట్ ఫెసిలిటీ ఏర్పాటు చేయబడింది. వరంగల్ పోలీస్ కమిషనర్ చొరవతో, ఎంజీఎం ఆసుపత్రి అధికారులు సిబ్బంది



సహకారంతో అడిక్షన్ ట్రీట్మెంట్ ఫెసిలిటీ కేంద్రాన్ని మరింత ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయడం జరిగింది. కేంద్రంలో ప్రత్యేక అడిక్షన్ ట్రీట్మెంట్ ఫెసిలిటీ వార్డు ఏర్పాటు చేసి పడకల సామర్థ్యాన్ని 10 నుంచి 20 కు పెంచడం జరిగింది. రోగుల భద్రత కోసం ఇనుప గ్రిల్స్, సీసీటీవీ నిఘా మరియు పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణాన్ని ఏర్పాటు చేశారు. బాధితుల మానసిక ప్రశాంతత కోసం క్యారమ్ బోర్డు, చెస్ వంటి వినోద సౌకర్యాలను కూడా కల్పించారు. అనుభవజ్ఞులైన వైద్యుల పర్యవేక్షణలో బాధితులకు వైద్య చికిత్స, కౌన్సెలింగ్ మరియు అడిక్షన్ ట్రీట్మెంట్ ఫెసిలిటీ సేవలు అందించబడతాయి. మత్తుకు బానిసైన యువతను తిరిగి సాధారణ, ఆరోగ్యకరమైన మరియు బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడమే ఈ కేంద్రం ప్రధాన లక్ష్యం. తమ పిల్లలు లేదా కుటుంబ సభ్యులు మత్తు పదార్థాలకు బానిసలైనట్లు గుర్తించిన తల్లిదండ్రులు ఆ సమస్యను దాచిపెట్టకుండా వెంటనే సహాయం పొందాలని వరంగల్ పోలీస్ కమిషనరేట్ విజ్ఞప్తి చేస్తోంది. సరైన సమయంలో చికిత్స, కౌన్సెలింగ్ కుటుంబ సభ్యుల సహకారం ద్వారా మత్తు బానిసత్వం నుంచి పూర్తిగా బయటపడే అవకాశం ఉంది. డీ-అడిక్షన్ చికిత్స అవసరమైన వారు ఎంజీఎం ఆసుపత్రిలోని కేంద్రాన్ని సంప్రదించి అవసరమైన సేవలను పొందవచ్చు.

అవసరమైన సహాయం కోసం సమీప పోలీస్ స్టేషన్ అధికారులను, ఎంజీఎం మానసిక వైద్య సిబ్బందిని కూడా సంప్రదించవచ్చున్నారు.

"మత్తును వదిలి -- జీవితాన్ని ఎంచుకోండి." "వ్యసనాన్ని దాచకండి -- సహాయం పొందండి." "చికిత్స ఒక జీవితాన్ని మార్చగలదు." మత్తు పదార్థాల వ్యసనానికి సంబంధించిన ఏదైనా సహాయం, సమాచారం లేదా మార్గదర్శకత్వం కోసం 87125 84473/87126 85299 సంప్రదించండి.

ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, ఎస్. బి యం. జి. యం సూపరింటెండెంట్ డా. రాంరెడ్డి, ఆర్.యం.ఓ అశ్వని కుమార్, ఎస్. బి ఇంచార్జి ఏసీపీ మధుసూదన్, డ్రగ్స్ కంట్రోల్ టీం ఇన్స్ స్పెక్టర్ సాయి రాం, ఆర్.ఐ శివ కేశవులు, ఆర్. ఎస్. ఐలు పూర్ణ చందర్ రెడ్డి,మనోజ్ రెడ్డి, నాగరాజు, పోలీస్ మరియు యం.జి.యం హాస్పటల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# చిన్న కొమురయ్య మృతి..

## కాంగ్రెస్ శ్రేణుల్లో విషాదం..

## పాడేమోసిన తొట్ల తిరుపతి యాదవ్..

**"అక్షిత పెద్దపెల్లి ప్రతినిధి":** కన్నీటి వీడ్కోలు చిన్న కొమురయ్య పాడె మోసిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ మాజీ వార్డు సభ్యులు కుర్రె చిన్న కొమురయ్య కన్నుమూత.. నివాళులర్పించిన మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ రామగిరి మండల పరిధిలోని ఆదివారంపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ వార్డు సభ్యులు కుర్రె చిన్న కొమురయ్య అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మరణవార్త తెలుసుకున్న మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ హుటాహుటిన గ్రామానికి చేరుకున్నారు. కొమురయ్య పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన అంతిమయాత్రలో పాల్గొన్న ఆయన.. కొమురయ్య పాడె మోశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ కోసం నిరంతరం శ్రమించిన నాయకుడిని కోల్పోవడం పార్టీకి, ఆదివారంపేట గ్రామానికి తీరని లోటని తిరుపతి యాదవ్ పేర్కొన్నారు ఈ కార్యక్రమం లో రామగిరి మండలం కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# అక్రమంగా తరలిస్తున్న పశువులు పట్టివేత

**చౌటుప్పల్/ అక్షిత న్యూస్:** చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ జి మన్మధ కుమార్ ఆదేశాల మేరకు గురువారం హెడ్ కానిస్టేబుల్ నరేష్, సిబ్బంది విధులు నిర్వహిస్తుండగా అక్రమంగా పశువుల రవాణా జరుగుతోందని విశ్వసనీయ సమాచారం అందడంతో పోలీసులు వెంటనే చౌటుప్పల్ పట్టణంలోని ధర్మోజీగూడెం క్రాస్ రోడ్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. టీయస్ 08యు జి 8181 నెంబర్ గల డీసీఎం వాహనమును అనుమానాస్పదంగా ఆపి తనిఖీ చేయగా, అందులో



16 ఆవులు, 10 ఎద్దులను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు.

వాహనాన్ని నడుపుతున్న ఎస్కే ఇస్మాయిల్ (34) అదుపులోకి తీసుకొని విచారించగా, అన్నయ్య పేట,రామచంద్రపురం, కోనసీమ జిల్లాకు చెందిన పశువుల యజమాని అసంతా వెంకన్న బాబు సూచనల మేరకు జగ్గయ్య పేట సంతలో కొనుగోలు చేసిన పశువులను హైదరాబాద్‌లోని బహదూర్‌పుర ప్రాంతానికి తరలిస్తున్నట్లు నిందితుడు తెలిపాడు. పోలీసు కేసు నమోచేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

# రేవంత్ పాలనకు జైకొట్టిన కాంగ్రెస్ శ్రేణులు..

## బోడుప్పల్‌లో భారీ బైక్ ర్యాలీ

## రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



**ఉప్పల్ అక్షిత ప్రతినిధి, సెప్టెంబర్ 3:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనను పూర్తిచేసుకున్న సందర్భంగా మల్కాజ్‌గిరి కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని బోడుప్పల్, చెంగిచర్ల డివిజన్ల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ పాలనపై తమ మద్దతును వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాలాభిషేకం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ఉద్దేశంతో బైక్ ర్యాలీ నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, మేడ్చల్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి బైక్ ర్యాలీలో పాల్గొని వారిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, మాజీ కార్పొరేషన్ అధ్యక్షులు పోగుల నర్సింహ రెడ్డి, బోడుప్పల్ డివిజన్ అధ్యక్షులు బొమ్మకు కళ్యాణ్, చెంగిచర్ల డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల దిలీప్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, బి-బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీరామా నగర్ కాలనీలో నూతన షెడ్ ప్రారంభం



**ఉప్పల్ అక్షిత ప్రతినిధి, సెప్టెంబర్ 3:** కాప్రా శ్రీరామా నగర్ కాలనీలో రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన నూతన షెడ్‌ను గురువారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. కాలనీ వాసుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్మించిన ఈ షెడ్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు. కాలనీ వాసుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, టీజీకే మూర్తి, లక్ష్మీనారాయణ, సతీష్ రెడ్డి, శ్రీరామా నగర్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. పెంటారెడ్డి, ప్రధాన కార్యదర్శి టి. జగ్గా రెడ్డి, ఉపాధ్యక్షులు జి. నవీన్ గౌడ్, ఎన్. బాలునాయక్, సంయుక్త కార్యదర్శులు వి. విష్ణువర్ధన్ రావు, కె. కృష్ణమోహన్, కోశాధికారి కిషోర్ తదితరులు పాల్గొన్నారు. షెడ్ నిర్మాణానికి సహకరించిన దాతలు పోలేపల్లి భారతి, కొండలరావులకు కాలనీ వాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# మండల స్థాయి క్రీడా పోటీలకు సన్నాహాలు

## 9, 10 తేదీల్లో మణుగూరులో పోటీలు

## ఎంఈఓ జి. స్వర్ణ జ్యోతి



**భద్రాద్రి కొత్తగూడెం, అక్షిత బ్యూరో:** మండల స్థాయి పాఠశాలల క్రీడా పోటీల నిర్వహణకు విద్యాశాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు మణుగూరు మండల ఎంఆర్సీ లో మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) జి. స్వర్ణజ్యోతి ఆధ్వర్యంలో మండలంలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల 9, 10 తేదీల్లో మణుగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ స్వర్ణజ్యోతి తెలిపారు. అండర్ 14, అండర్-17 బాలబాలికల విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనబరిచి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పోటీల నిర్వహణలో ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# గ్రీన్ గ్రోవ్‌లో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



**చౌటుప్పల్/ అక్షిత న్యూస్:** చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని గ్రీన్ గ్రోవ్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఒకరోజు ముందస్తుగా గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధాదేవి, గోపికల వేషధారణలో అందంగా ముస్తాబై, సాంప్రదాయ దుస్తులతో అలరించారు. చిన్నారులు ప్రదర్శించిన శ్రీకృష్ణుడి బాల్యలీలలు, రాధాకృష్ణుల వేషధారణ, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా గ్రీన్ గ్రోవ్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ వీణ అనిల్ రెడ్డి, డైరెక్టర్ లక్ష్మి, ఏఓ మురళి పాల్గొని చిన్నారులకు శ్రీకృష్ణాష్టమి పండుగ విశేషాలను తెలిపి శుభాకాంక్షలు తెలిపారు.

# ఆకట్టుకున్న ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు




**నడిగూడెం, అక్షిత న్యూస్:** నడిగూడెం శ్రీ సాయి పబ్లిక్ స్కూల్లో గురువారం నిర్వహించిన ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు ఆకట్టుకున్నాయి. చిన్నారులు చిన్ని కృష్ణుడు, గోపికమ్మ వేషధారణలో సందడి చేశారు .చిన్నారులు ఉట్టి కొట్టారు. ఈ సందర్భంగా చిన్నారులు నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకుంది. విద్యార్థులు మన సంస్కృతి సాంప్రదాయాలు,పండుగలు,ఆచారవ్యవహారా లను తెలుసుకొని పరిరక్షించాలని పాఠశాల కరస్పాండెంట్ బుస్సా మహేష్ ప్రిన్సిపల్ బుస్సా సులోచన అన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక వేషధారణలో వచ్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాంబాబు, సిరాజ్ ,జ్యోతి మల్లిక ,రజియా, భవాని, లక్ష్మీ ,నాగమణి ,స్వప్న, ఉమా, వీర కుమారి,సాజిద ,విజయ పాల్గొన్నారు.

# నూతన ఆర్టీసీ బస్సు సర్వీసును ప్రారంభించిన డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్

**మహబూబ్ నగర్,అక్షిత న్యూస్:** మల్లాపూర్ గ్రామంలోని విద్యార్థులు కళాశాలలు, పాఠశాలలకు వెళ్లేందుకు సరైన బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిందే. ఈ సమస్యతో పాటు గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి మల్లాపూర్ గ్రామ సర్పంచ్ శ్రీశైలం వార్డు సభ్యులు, డీసీసీ ఎగ్జిక్యూటివ్ మజర్ ఖాన్ మరియు గ్రామ పెద్దలు మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ ని కలిసి వివరించారు.

ఈ విషయాన్ని తెలుసుకున్న వెంటనే డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ స్పందించి మహబూబ్‌నగర్ జిల్లా ఆర్టీసీ డిపోకు వెళ్లి డిపో మేనేజర్ అశోక్ తో మాట్లాడారు. మల్లాపూర్ గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలని కోరడంతో, విద్యార్థులు మరియు గ్రామ ప్రజల సౌకర్యార్థం నూతన ఆర్టీసీ బస్సు సర్వీసును ఏర్పాటు చేయించారు.







ఈ సందర్భంగా నేడు మల్లాపూర్ గ్రామానికి వెళ్లిన మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ డీసీసీ అధ్యక్షులు శ్రీ సంజీవ్ ముదిరాజ్ నూతన ఆర్టీసీ బస్సు సర్వీసును ప్రారంభించారు.

ఈ సందర్భంగా మల్లాపూర్ గ్రామ ప్రజలు, విద్యార్థులు డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ ని ప్రత్యేకంగా అభినందిస్తూ, తమ సమస్యను వెంటనే పరిష్కరించి బస్సు సౌకర్యం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు చిట్టెం అభిజిత్ రెడ్డి కోయిల్‌కొండ మండల కాంగ్రెస్ అధ్యక్షులు శేఖర్ మల్లాపూర్ గ్రామ సర్పంచ్ శ్రీశైలం,వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మల్లాపూర్ గ్రామ పెద్దలు, డీసీసీ ఎగ్జిక్యూటివ్ మజర్ ఖాన్ గారు, డీసీసీ జనరల్ సెక్రటరీ ఎం.డి. కలీం , కాంగ్రెస్ నాయకులు బూరేమోని చందు యాదవ్ రాజు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# పాత బస్టాండ్‌ను అభివృద్ధి చేయండి

## వేల కోట్లు తెచ్చామంటున్నారు, 2 కోట్లతో ఆధునీకరణ చేయలేరా?

## నెల రోజుల్లో పనులు చేపట్టకపోతే ప్రజా ఆందోళన

## అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు డా. సతీష్ యాదవ్



**వనపర్తి అక్షిత ప్రతినిధి :** నాలుగైదు జిల్లాలకు రాకపోకలకు కీలకంగా ఉన్న పాత బస్టాండ్ అభివృద్ధికి నోచుకోకపోవడంపై అఖిలపక్ష ఐక్యవేదిక, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ జేఏసీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పాత బస్టాండ్‌ను పరిశీలించిన వారు ప్రయాణికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు డా. సతీష్ యాదవ్ మాట్లాడుతూ.. నియోజకవర్గానికి వేల కోట్ల నిధులు తెచ్చామని చెబుతున్న నాయకులు రూ.2 కోట్లతో పాత బస్టాండ్‌ను ఆధునీకరించలేరా? అని ప్రశ్నించారు. తాగునీరు, మూత్రశాలలు, నిలువ నీడ వంటి కనీస సౌకర్యాలు లేక ప్రయాణికులు దుమ్ము, ధూళిలో, ఎండా వానలో అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ అధికారులు ఎవరూ లేక ప్రైవేటు వాహనాలకు పార్కింగ్ సౌకర్యం చేశారు. కనుక రాజకీయాలు, విమర్శలు, ఆరోపణలు పక్కనపెట్టి ప్రజలకు అవసరమైన అభివృద్ధిపై దృష్టి పెట్టండి. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయండి" అని అన్నారు.

పాత బస్టాండ్‌ను వెంటనే ఆధునీకరించి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. నెల రోజుల్లో పనులు ప్రారంభించకపోతే ప్రజా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షులు డా"సతీష్ యాదవ్, డిఎస్పీ జిల్లా అధ్యక్షులు రామకృష్ణ మహారాజ్, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ జేఏసీ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు కొత్త గొల్ల శంకర్, రాజనగరం రామస్వామి, మధు, ఎల్లయ్య, సూర్య ప్రకాష్, గంధం రవి, చందు యాదవ్, ఆంజనేయులు, శివకుమార్, శాంతయ్య, రవి, రమేష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# కూలీ పెంపు కోసం కాటన్ చీరల కార్మికుల సమ్మె

## నాలుగో రోజుకు చేరిన సమ్మె..

## నేతన్న చౌక్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన




**రాజన్న సిరిసిల్ల అక్షిత బ్యూరో:** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం: కాటన్ చీరల తయారీ కార్మికుల కూలీ రేట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ కార్మికులు చేపట్టిన సమ్మె నాలుగో రోజుకు చేరుకుంది. కూలీ రేట్లు పెంచి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు గురువారం సిరిసిల్లలోని నేతన్న చౌక్ వద్ద నేతన్న విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు.

ఈ సందర్భంగా కార్మికులు ఎర్రజెండాలు చేతబట్టి పెద్ద సంఖ్యలో పాల్గొని కూలీ పెంపు కోసం నినాదాలు చేశారు. కాటన్ చీరల తయారీలో కష్టపడి పనిచేస్తున్నప్పటికీ తమకు సరైన కూలీ అందడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా కూలీ రేట్లు పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. కాటన్ చీరలకు కూలీ పెంచాలని, కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను యజమానులు, సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలని కోరారు. కూలీ పెంపుపై స్పష్టమైన నిర్ణయం తీసుకునే వరకు సమ్మెను కొనసాగిస్తామని కార్మికులు స్పష్టం చేశారు. నాలుగో రోజుకు చేరిన సమ్మెతో కాటన్ చీరల ఉత్పత్తి నిలిచిపోవడంతో కార్మికుల సమస్యపై ప్రభుత్వం, అధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో కోడం రమణ అన్నదాస్ గణేష్ ఎల్లారెడ్డి అంబదాస్ లక్ష్మణ్ కోడంసత్యం వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు

# సిరిసిల్లలో ఘనంగా ఇందిరమ్మ ఇళ్ల

# మంజూరు పత్రాల పంపిణీ

**జిల్లా వ్యాప్తంగా 710 మంది లబ్ధిదారులకు మంజూరు**

**నియోజకవర్గానికి 2 వేల ఇందిరమ్మ ఇళ్లు: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**రాజన్న సిరిసిల్ల అక్షిత బ్యూరో:** పేదల సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో అర్హత సాధించిన లబ్ధిదారులకు గురువారం మంజూరు పత్రాలను అందజేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 710 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసినట్లు తెలిపారు.

సిరిసిల్లలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లబ్ధిదారులకు మంజూరు పత్రాలను స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సొంత ఇంటి సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.


**త్వరలో నియోజకవర్గానికి 2 వేల ఇళ్లు**

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా త్వరలోనే వేములవాడ నియోజకవర్గానికి 2 వేల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. అర్హత కలిగిన పేద కుటుంబాలకు ప్రాధాన్యతనిస్తూ దశలవారీగా ఇళ్లను మంజూరు చేస్తామని పేర్కొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం లబ్ధిదారులకు విడతల వారీగా సక్రమంగా అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు. మంజూరు పత్రాలు పొందిన లబ్ధిదారులు నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించి, ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**అర్హులందరికీ సంక్షేమ పథకాల ఫలాలు**

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని ఆది శ్రీనివాస్ తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, మంజూరు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. అర్హత ఉన్నప్పటికీ ఇంకా ఇల్లు మంజూరు కాని కుటుంబాలను గుర్తించి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం తదుపరి దశల్లో అవకాశం కల్పిస్తామని తెలిపారు.



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అధికారులు లబ్ధిదారులకు పూర్తి సహకారం అందించాలని, నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని ఆదేశించారు. పేద కుటుంబాలకు శాశ్వత నివాసం కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రభుత్వ ఉద్దేశమని అన్నారు.

**లబ్ధిదారుల్లో ఆనందం**

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న సొంతింటి కల సాకారం కానుండటంతో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలతో మమేకమై ఒక్కరోజు టీచర్‌గా మారిన జిల్లా కలెక్టర్

**లోహిత గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సందర్శన**



**వరంగల్ , అక్షిత బ్యూరో:** విద్యార్థుల అభ్యాస స్థాయిని పరిశీలించడంతో పాటు వారిలో విద్యపై ఆసక్తిని పెంపొందించే లక్ష్యంతో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం సంగెం మండలం లోహిత గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో ఆత్మీయంగా మమేకమై, ఒక్కరోజు ఉపాధ్యాయురాలిగా మారి వారికి స్వయంగా విద్యాబోధన చేశారు.

తరగతి గదిలో విద్యార్థినులతో కలిసి కూర్చొని వారి చదువు తీరును పరిశీలించిన కలెక్టర్, పలు అంశాలను సులభంగా అర్థమయ్యే విధంగా బోధించారు. విద్యార్థినులను ప్రశ్నలు అడుగుతూ వారి అభ్యాస సామర్థ్యాలను తెలుసుకున్నారు. పిల్లలు చెప్పిన సమాధానాలను ఆసక్తిగా విని, వారిని ప్రోత్సహించారు.



చదువుతో పాటు క్రమశిక్షణ, పరిశుభ్రత, మంచి అలవాట్లను అలవర్చుకోవాలని విద్యార్థినులకు సూచించారు. ప్రతిరోజూ పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరై, ఉపాధ్యాయులు బోధించే పాఠాలను శ్రద్ధగా వినాలని తెలిపారు. విద్యే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకునేందుకు బలమైన పునాది అని పేర్కొంటూ, ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదవాలని సూచించారు.

పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు వారి సమగ్ర అభివృద్ధికి అవసరమైన వాతావరణం కల్పించడం అత్యంత ముఖ్యమని కలెక్టర్ తెలిపారు. పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడంలో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా విద్యార్థినులు కలెక్టర్‌తో ఉత్సాహంగా మాట్లాడి, ఆమె బోధనను ఆసక్తిగా విన్నారు. జిల్లా కలెక్టర్ స్వయంగా తరగతి గదిలో ఒక్కరోజు ఉపాధ్యాయురాలిగా మారి పాఠాలు బోధించడం విద్యార్థినుల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది.

కలెక్టర్ వెంట డీబీసీడీఓ పుష్పలత, ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్ రావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి జిల్లాలోని ఆక్రమిత చెరువులు మరియు ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలి



**పెద్దపల్లి అక్షిత ప్రతినిధి:** హైడ్రా ల హైదరాబాదులో ఎలా అయితే చెరువులను ప్రభుత్వ భూములను దేవుడి మాన్యాలను కబ్జా చేసి వాటిల్లో అక్రమ నిర్మాణాలను కూల్చుతున్న ప్రభుత్వం ఇదే తరహాలో రాష్ట్రమంతా చేయాలని ప్రజలు కోరుతున్నారు, ముఖ్యంగా పెద్దపెల్లి జిల్లాలో ప్రభుత్వ భూములు మరియు చెరువులు చాలా ఆక్రమించబడ్డాయి, పెద్దపల్లి జిల్లా ఓదాలలో చెరువును ఆక్రమించారు సుమారు 20 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసినట్టుగా అక్కడి ప్రజలు చెప్తున్నారు, పోతారంలో చెరువు కబ్జా చేసి ఇండ్లు నిర్మించారు, మంథనిలోని ఒక ప్రైవేట్ డిగ్రీ కళాశాల చెరువును ఆక్రమించి అక్కడ నిర్మాణాలు చేపట్టింది, గుంజపడుగు లో కూడా చెరువు కబ్జాకు గురైంది, ఇక పెద్దపెల్లి పరిసర గ్రామాల్లో చాలావరకు కబ్జాకు గురైనట్టుగా తెలుస్తుంది, జిల్లాలోని ఎల్లమ్మ గుండమ్మ చెరువులు కబ్జాకు గురైనట్టుగా తెలుస్తుంది, అలాగే సుల్తాన్ బాద్ హై రోడ్ కి దగ్గరలో ఉన్న చెరువును ఆక్రమించి చాలా సంవత్సరాలుగా కట్టడాలు చేసుకొని నివసిస్తున్నారు, అలాగే పెద్దపల్లి జిల్లాలోని దేవుడు భూములు చాలా మటుకు కబ్జాకు గురైనట్టుగా తెలుస్తుంది, కాంగ్రెస్ ప్రభుత్వం ఒక మంచి నిర్ణయం తీసుకొని కబ్జా భూములపై చేసిన నిర్మాణాలను హైదరాబాదులో కూల్చివేస్తుంది అలాగే పెద్దపెల్లి జిల్లాలోని కబ్జాలకు గురైన భూములను వాటిలో నిర్మించిన నిర్మాణాలను కూల్చివేస్తూ భూములని ప్రభుత్వం ఆ దినపరచుకోవాలని ఇక్కడి ప్రజలు కోరుకుంటా ఉన్నారు, పెద్ద పెల్లి మంథని శాసనసభ్యులు మరియు జిల్లా కలెక్టర్ ఈ విషయంలో చొరవ తీసుకొని ఆక్రమిత భూములను చెరువులను గుర్తించి తక్షణమే చర్యలు తీసుకొని ప్రభుత్వ ఆస్తులని కాపాడాలని మేధావులు కోరుకుంటున్నారు..

## రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



**చౌటుప్పల్/ అక్షిత న్యూస్:** చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ పరిధి తూప్రాన్ పేట వద్ద జాతీయ రహదారిపై గత నెల ఆగస్టు 31 న సుమారు రాత్రి 11 గంటల సమయంలో తూప్రాన్ పేట్ ప్రాంతంలోని లక్ష్మీ దుర్గ హోటల్ సమీపంలో రోడ్డుపై ద్విచక్ర వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ ఈనెల ససెప్టెంబర్ 02 వ తేదీ బుధవారం మృతి చెందినట్లు చౌటుప్పల్ పోలీసులు తెలిపారు. మృతుడి వద్ద ఎటువంటి గుర్తింపు పత్రాలు లభించలేదని,మృతదేహాన్ని చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచామని తెలిపారు. ఈ ఘటనపై చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని, మృతుడిని గుర్తించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. మృతుడి వయస్సు సుమారు 40-50సంవత్సరాలు, ఎత్తు: సుమారు 5.7 అడుగులు

బూడిద రంగు చొక్కా, నీలం రంగు డబాల లుంగీ, తెలుపు గడ్డం మరియు తెలుపు నలుపు రంగు జుట్టు కలదని,అతని దగ్గర రెడ్ కలర్ బెడ్ షీట్ ప్రమాదం జరిగినప్పుడు అక్కడ ఉన్నట్లు పోలీసులు వివరాలు వెల్లడించారు.

మృతుడి గురించి లేదా అతని కుటుంబ సభ్యుల గురించి సమాచారం తెలిసిన వారు చౌటుప్పల్ పో లీస్ స్టేషన్‌ను 918712662744 నంబర్ కు తెలియజేయాలని కోరారు.

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY జాతీయ దినపత్రిక



## ముత్యాలమ్మ తల్లి నూతన విగ్రహాలకు జలాభిషేకం



చిలుకూరు, సెప్టెంబర్ 3 (అక్షిత న్యూస్): నారాయణపురం, పాలేఅన్నారం గ్రామంలో ముత్యాలమ్మ తల్లి నూతన విగ్రహాల వద్దకు మహిళలు ప్రతి ఇంటి నుంచి జలబిందెలతో నీటిని తీసుకొచ్చి ముత్యాలమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో జలాభిషేకం చేశారు.అమ్మవారికి ప్రత్యేక పూజలు,హోమాలు నిర్వహించి, గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని ప్రార్థించారు.మహిళలు జలబిందెలతో తరలివస్తుండడంతో ఆలయ పరిసరాల్లో పండుగ వాతావరణం నెలకొంది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

## షైన్ స్కూల్లో అంగరంగ వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు



అక్షిత ప్రతినిధి భూపాలపల్లి: భూపాలపల్లి పట్టణంలోని షైన్ హై స్కూల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, బలరాముడు, గోపికల వేషధారణలో పాల్గొని అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ అనిశెట్టి భానుచందర్ మాట్లాడుతూ, శ్రీకృష్ణుని గొప్పతనం, ఆయన ఆదర్శాలు, ధర్మ స్థాపన కోసం చేసిన కృషి గురించి విద్యార్థులకు వివరించారు. చిన్నతనంలో శ్రీకృష్ణుడు చేసిన చిలిపి పనులను సరదాగా వివరిస్తూ, విద్యార్థులకు ఆనందంతో పాటు మంచి సందేశాన్ని అందించారు. వేడుకల్లో భాగంగా సంప్రదాయబద్ధంగా ఉట్టి కొట్టి కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని ఉట్టిని కొట్టి సందడి చేశారు. చిన్నారుల కేరింతలు, శ్రీకృష్ణ నామస్మరణతో పాఠశాల ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది.. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## ఆర్థిక సహాయం అందజేసిన వాకిటి అనంతరెడ్డి



వలిగొండ/ అక్షిత న్యూస్: యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలో అరూర్ గ్రామానికి చెందిన కొప్పుల శంకర్ గౌడ్ మృతి చెందిన వారి కుటుంబాన్ని పరామర్శించి రాష్ట్ర నాయకులు వాకిటి అనంతరెడ్డి 5000 రూపాయలు, ఉప సర్పంచ్ గొడ్డటి సత్యం 5000 రూపాయలు గ్రామ శాఖ అధ్యక్షులు బుర్ర నరసింహ యాదవ్ 5000 రూపాయలు ఆర్థిక సహాయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వేముల అనిల్ గుట్ట ధర్మకర్త దామర అంజయ్య శివాజీ యూనియన్ అధ్యక్షులు బత్తిని కర్ణ గౌడ్ కాంగ్రెస్ నాయకులు బండారు మైపాల్ రెడ్డి చిలకమర్రి ఉపేందర్ ఎలిమినేటి పెంటయ్య కొప్పుల దాసు ఎర్ర గుట్ట ఎర్ర శ్రీనివాస్ లోతుకుంట లక్ష్మణ్ నల్ల రాములు బత్తిని కిష్టయ్య అధ్యక్షులు ఎర్ర సాయి గౌడ్ ఉపాధ్యక్షులు పాక మహేష్ సోషల్ మీడియా బుర్ర శ్రీకర్ యాదవ్ తుదరులు పాల్గొన్నారు.

# రైతులను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

**హామీలు కొండంత.. అమలు శూన్యం**

**పంటలకు బోనస్ లేదు.. గిట్టుబాటు ధర లేదు.. రైతన్నకు మిగిలింది కన్నీరే**

**సంక్షోభంలో వ్యవసాయ రంగం... రైతులకు అండగా బీఆర్ఎస్**

**మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్**

**కాంగ్రెస్ 1000 రోజుల విధ్వంస పాలనపై బీఆర్ఎస్ చార్జ్‌షీట్**





షాద్ నగర్, అక్షిత ప్రతినిధి: కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో వ్యవసాయ రంగాన్ని పూర్తిగా సంక్షోభంలోకి నెట్టిందని, ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అన్నదాతలను మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను ఎండగడుతూ కొందుర్గ్ మండల కేంద్రంలోని జి.ఎం. పటేల్ గార్డెన్‌లో ఆయన ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి వ్యవసాయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ 1000 రోజుల పాలనలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను బీఆర్ఎస్ నాయకులు వివరించారు. వరంగల్ డిక్లరేషన్‌లో రైతులకు ఇచ్చిన హామీలను గాలికొదిలేసి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నిలువునా మోసం చేసిందని విమర్శించారు. రైతులకు రైతు భరోసా అందించడంలో ప్రభుత్వం విఫలమైందని, ఎన్నికల ముందు హామీ ఇచ్చిన రూ.2 లక్షల రైతు రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని అన్నారు. రూ.50 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని చెప్పి ఆ హామీని కూడా నీరుగార్చారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు అందిన రైతుబంధు, 24 గంటల ఉచిత విద్యుత్ వంటి పథకాలను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. ప్రస్తుతం రైతులకు కనీసం పది గంటల పాటు కూడా నిరంతర విద్యుత్ అందని పరిస్థితులు ఉన్నాయని అన్నారు. వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అన్ని పంటలకు బోనస్ ఇస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామీని బోగస్‌గా మార్చిందని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలమైందని విమర్శించారు. మద్దతు ధర కోసం రైతులు ఎదురుచూస్తుంటే, పంటల కొనుగోలు కేంద్రాల విషయంలో కూడా ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోవడం లేదన్నారు. వర్షాలు, తుఫాన్లు, ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయిన రైతులకు సకాలంలో పంటల బీమా పరిహారం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల కష్టాలను పట్టించుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ 1000 రోజుల పాలనలో రైతులకు ఒరిగిందేమీ లేదని.. హామీలు మాత్రం కొండంత, అమలు మాత్రం శూన్యమని విమర్శించారు. రైతుల సమస్యలపై బీఆర్ఎస్ ఎప్పటికీ రాజీపడదని, అన్నదాతలకు అండగా నిలిచి వారి హక్కుల కోసం ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తామని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ స్పష్టం చేశారు. రైతులకు ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న రైతు ప్రయోజనాలను తక్షణమే పరిష్కరించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, రవీందర్ యాదవ్, మాజీ మార్కెట్ చైర్మన్లు, మాజీ ఎంపీపీలు, మాజీ జడ్పీటీసీలు, మాజీ పీఏసీఎస్ చైర్మన్లు, మాజీ వైస్ చైర్మన్లు, మాజీ వైస్ ఎంపీపీలు, బీఆర్ఎస్ మండల, గ్రామ, మున్సిపాలిటీ, వార్డు అధ్యక్షులు, ప్రస్తుత మరియు మాజీ సర్పంచులు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, మాజీ ఎంపీటీసీలు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ యువత, అనుబంధ విభాగాల నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు..

## అల్ఫోర్స్ "ప్లానెట్ కిడ్స్," అల్ఫోర్స్ "ఇ-టెక్నో" స్కూల్లో శ్రీకృష్ణుని జన్మదిన వేడుకలు

కరీంనగర్ అక్షిత బ్యూరో: భగవంతుణ్ణి అన్నివేళల్లో కొలిచిన వారికి సుఖ సంతోషాలతో పాటు అనేక రకాలైన లాభాలు కలుగుతాయని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక మంకమ్మతోటలోని అల్ఫోర్స్ ప్లానెట్ కిడ్స్ లో, భగత్ నగర్ లో గల అల్ఫోర్స్ ఇ- టెక్నో స్కూల్ లో వేడుకగా నిర్వహించినటువంటి ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడారు. ఈ పూజలకు ప్రజలందరూ వారి కుటుంబాలతో కలిసి హాజరైతారని ప్రధానంగా ఆధ్యాత్మికవేత్తలు హాజరై ప్రజల్లో ఆధ్యాత్మికతను పెంపొందిస్తారని గుర్తు చేశారు.తెల్లవారుజామున విశేష అభిషేకాలు, అలంకరణ మరియు ప్రత్యేక అర్చనలు నిర్వహిస్తారని వారు చెప్పారు.

సాయంత్రం యువకులతో ప్రధాన ఘట్టమైన ఉట్టికొట్టే కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహంగా నిర్వహిస్తారని మరియు పిల్లలను ఆనందం పెంపొందిస్తారని వారు చెప్పారు. పిల్లల కోసం శ్రీకృష్ణుని వేషధారణంగా పోటీలు భక్తి సంగీతం ఏర్పాటు చేస్తారని వారు గుర్తు చేశారు

వేడుకలు పురస్కరించుకొని బాలకృష్ణునికి అత్యంత ప్రీతిపాత్రమైన పాలమీగడ, వెన్న మరియు పెరుగును ప్రత్యేకంగా సమర్పిస్తారని వారు చెప్పారు. ద్వాపర యుగంలో మధురానగరంలో కంసుడి ఖారాగారంలో దేవకి వసుదేవన అష్టమ గర్భంగా శ్రీకృష్ణుడు జన్మించాడని, శ్రావణమాసం బహుళపక్ష అస్తమతిథి మరియు రోహిణి నక్షత్రం కలయికలో అర్ధరాత్రి వేళ లోక కళ్యాణం కోసం స్వామివారి భూమిపై అవతరించారని చెప్పారు. స్వామివారికి నైవేద్యంగా అటుకుల ప్రసాదం శనగపప్పు వడలు సమర్పిస్తారని చెప్పారు



వేడుకలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించినటువంటి పలు నృత్య ప్రదర్శనలు ప్రధానంగా శ్రీ కృష్ణ మహోత్యం, శ్రీకృష్ణ లీలలు ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# వినాయక చవితి ఏర్పాట్లను గణేష్ మండపాల నిర్వాహకులే ప్రత్యేకంగా పర్యవేక్షణ చేయాలి




**కరీంనగర్ అక్షిత బ్యూరో:** కరీంనగర్ నగర పాలక సంస్థ లో వినాయక చవితి పండుగకు సంబంధించిన ముందస్తు ఎర్పాట్లు చెయ్యడంలో బిజెపి పాలకవర్గం పూర్తిగా విఫలం చెందిందని తెలంగాణ రక్షణ సేన కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గుంజపడుగు హరిప్రసాద్ ఆరోపించారు . నగరం లోని పార్టీ కార్యాలయంలో ఎర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ వినాయక చవితి పండుగకు కేవలం పది రోజులు రోజులు మాత్రమే సమయం ఉందని కరీంనగర్ నగరంలో పండుగకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లు ఇంకా పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదన్నారు . బిజెపి పాలక వర్గానికి పండుగల మీద ఎంతటి శ్రద్ధ ఉందో తెలుస్తుందని ఆరోపించారు ..వినాయక చవితి పండుగకు నెల రోజుల ముందుగానే అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామని చెప్పిన కేంద్ర మంత్రి బండి సంజయ్ మాటలు ఏమయ్యాయని తెలంగాణ రక్షణ సేన పార్టీ పక్షాన అయన ప్రశ్నించారు .. కరీంనగర్ నగరంలో 66 డివిజన్లు ఉంటే ప్రతి డివిజన్ కు డస్ట్, సిమెంట్ ప్యాచ్ వర్క్స్ తదితర పనుల కోసం సుమారుగా ఒక లక్ష రూపాయల చొప్పున టెండర్లు పిలిచి దాని గడువు ఈ నెల ఐదవ తేదీ వరకు గడువు మాత్రమే పెట్టారని తెలిపారు టెండర్లు పూర్తి అయ్యి పనులు ప్రారంభం అయ్యేసరికి పది రోజుల సమయం పడుతుందని అవి పూర్తి అయ్యేసరికి గణేష్ నవరాత్రులు సైతం పూర్తి అవుతాయని మండిపడ్డారు .పనులు ఆలస్యంగా ప్రారంభించడం వల్ల చివరి నిమిషంలో హడావుడిగా పనులు చేయడంలో ఎవరి ప్రయోజనం ఉంటుందో నగరపాలక సంస్థ అధికారులు సమాధానం చెప్పాలన్నారు .

వినాయక చవితి సమీపిస్తున్న సమయంలో హడావుడిగా పనులు చేపట్టి, నాణ్యతను పట్టించుకోకుండా పనులు చెయ్యడం ద్వారా ప్రజాధనం దుర్వినియోగం అయ్యే ప్రమాదం ఉందనే అనుమానం ప్రజలలో ఉందని. ప్రతి డివిజన్‌లో చేపట్టిన పనుల అంచనా వ్యయం, కాంట్రాక్టర్ వివరాలు, పనుల పరిమాణ వివరాలను క్షేత్రస్థాయిలో నగర పాలక సంస్థ కమీషనర్ ప్రత్యేకమైన దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు వినాయక చవితి పండుగ ప్రజల విశ్వాసానికి సంబంధించిన పండుగ నగర ప్రజలంతా ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఈ పండుగ ఏర్పాట్లను కూడ అదేస్థాయిలో అవసరమైన సౌకర్యాలు కల్పించడమే నగర పాలక సంస్థ పాలకవర్గం బాధ్యత. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి యుద్ధ ప్రాతిపదికన నాణ్యతతో కూడిన పనులను పూర్తి చెయ్యలని తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షులు గుంజపడుగు హరిప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కరీంనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ లింగంపల్లి నాగరాజు, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గం ఇంచార్జ్ అంకం శివరాణి, చొప్పదండి నియోజకవర్గం నాయకులు మ్యాకల తిరుపతి, జిల్లా నాయకులు రంగరవేణి లక్ష్మణ్, కుతాడి శ్రీనివాస్, శ్రీరాముల రమేష్, బసవేణి రాజేందర్, మడిపల్లి వినిత్ బండారి అభిరాం, మహిళ నాయకురాలు జంగ అపర్ణ, అసియా సుల్తానా, పల్లె శారద తదితరులు ఉన్నారు.

## విశ్వకర్మ యోజన లబ్ధిదారికి అభినందనలు తెలియజేసిన బిజెపి నాయకులు



**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి:** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన విశ్వకర్మ యోజన పథకం కింద ప్రయోజనం పొందిన కల్వకుర్తి పట్టణం ఇందిరానగర్ వాసి అంబటి శాంతమ్మ కు స్థానిక బిజెపి నాయకులు అభినందనలు తెలియజేశారు ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కులవృత్తులను మరియు మహిళలను దృష్టిలో పెట్టుకొని వారిని ప్రోత్సహిస్తూ విశ్వకర్మ యోజన పథకం రూపొందించడం జరిగింది ఈ పథకంలో భాగంగా దేశంలోని కులవృత్తులకు భారత ప్రభుత్వం తరపున మేలు చేయాలని సదుద్దేశంతో వారికి స్కిల్ డెవలప్మెంట్ మెలకువలు నేర్పి వారి యొక్క కులవృత్తిలో మరింత గొప్పగా రాణించాలని వారికి ఆర్థికంగా అండదండా ఉండాలని ట్రైనింగ్ ఇస్తూ బ్యాంకుల ద్వారా ఆర్థిక సాయం అందజేయడం జరుగు తుంది కాబట్టి ఇలాంటి గొప్ప అవకాశాన్ని కల్వకుర్తి ప్రాంత వాసులుఉపయోగించుకోవాలని కోరుతున్నాం అని తెలియ జేశారు, ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గన్నోజు బాబీదేవ్,రాష్ట్ర కౌన్సిల్ మెంబెర్ మొగిలి దుర్గాప్రసాద్,ఓబీసీ మోర్చా రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ గుండోజు గంగాధర్,జిల్లా ఉపాధ్యక్షులు బోడ నరసింహ,జిల్లా కార్యదర్శి గుర్రాల రాంభూపాల్ రెడ్డి,నాయకులు వాకిటి శ్రీకాంత్, ఎస్ఆర్ఎస్ రవి,ఎల్లగౌడ్, తదితరులు పాల్గొన్నారు

## జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని శివాని ఎంపిక



**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈనెల 26, 27 తేదీల్లో నిర్వహించిన 12వ తెలంగాణ స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని తోటకూరి శివాని ప్రతిభ కనబరిచింది. బి.ఏ. ప్రథమ సంవత్సరం చదువుతున్న శివాని 1000 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం, వ్యాయామ విభాగం అధిపతి డాక్టర్ ఎం. రవీందర్‌రావుతో పాటు అధ్యాపకులు శివానిని అభినందించారు. క్రమశిక్షణతో సాధన చేస్తూ జాతీయస్థాయిలోనూ ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ఈనెల 16 నుంచి 18 వరకు పాండిచ్చేరిలోని ఇందిరాగాంధీ స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఉప్పలంలో నిర్వహించనున్న 37వ సౌత్ జోన్ జాతీయస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో శివాని తెలంగాణ రాష్ట్రం తరఫున పాల్గొననున్నట్లు కళాశాల ప్రతినిధులు తెలిపారు.

## శ్రీ చాణిక్య పాఠశాలలో ముందస్తు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు...



**కోదాడ అక్షిత ప్రతినిధి:** కోదాడ పట్టణంలోని శ్రీ చాణిక్య పాఠశాలలో ముందస్తుగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు పగడాల తేజ్ వర్షిత్, రుత్విక శ్రీకృష్ణుడు, రాధ వేషధారణలో సందడి చేశారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. శ్రీకృష్ణుడి బాల్య ఘట్టాలను ప్రతిబింబించేలా విద్యార్థుల వేషధారణ, నృత్య ప్రదర్శనలు అలరించాయి. ఈ సందర్భంగా కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు శ్రీకృష్ణుడి బోధనలు, సద్గుణాలను అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో రైతు కష్టాలు వెయ్యి రోజుల్లో వెయ్యి సమస్యలు

### మండల పార్టీ అధ్యక్షులు పల్లా నర్సిరెడ్డి



**నడిగూడెం, అక్షిత న్యూస్:** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర టిఆర్ఎస్ పార్టీ ఆదేశాల మేరకు, కోదాడ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ సూచన మేరకు నడిగూడెం మండల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు పల్లా నర్సిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను, ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి, 1000 రోజులు గడిచినా హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు.

“ఆరు గ్యారంటీలు -- వంద రోజులు అన్నారు... 1000 రోజులు గడిచినా రైతు జీవితంలో మాత్రం మార్పు రాలేదు. మాటలు ఎక్కువ... చేతల్లో మాత్రం శూన్యం” అని అన్నారు.

రైతులకు సక్రమంగా విద్యుత్ సరఫరా చేయకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని, ప్రభుత్వం హామీ ఇచ్చిన 24 గంటల విద్యుత్ కూడా సక్రమంగా అందడం లేదని ఆరోపించారు. రైతు భరోసా, రైతు బీమా వంటి రైతు సంక్షేమ కార్యక్రమాల విషయంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.పంట పొలాలకు అవసరమైన సాగునీటిని అందించడంలో కూడా ప్రభుత్వం విఫలమైందని, ఎల్-35 నుంచి సాగర్ నీటిని పంట పొలాలకు అందించాలని డిమాండ్ చేశారు.కేసీఆర్ పాలనలో రైతు కడుపు నిండేలా పథకాలు అమలు చేస్తే... కాంగ్రెస్ పాలనలో రైతు కడుపు కొట్టే పరిస్థితి వచ్చింది. కేసీఆర్ రైతును రాజుగా చూస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతును కూలీ కన్నా తక్కువగా చూస్తోంది” అని పల్లా నర్సిరెడ్డి ఘాటుగా వ్యాఖ్యానించారు.

రైతులు, విద్యార్థులు, వ్యాపారులు, ఉద్యోగులు, కార్మికులు ఇలా అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ పాలనలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.

ప్రజా ప్రభుత్వం అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం... ప్రజలకు ఇబ్బందులు తెచ్చే ప్రభుత్వంగా మారింది. రైతు కన్నీరు తుడవాల్సిన ప్రభుత్వం, రైతు కన్నీటికి కారణం కావడం బాధాకరం” అని అన్నారు.

రైతుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి, సక్రమమైన విద్యుత్ సరఫరా చేయడంతో పాటు, ఎల్ 34, ఎల్-35 నుంచి సాగర్ నీటిని పంట పొలాలకు విడుదల చేయాలని, రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని పల్లా నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండలం సమన్వయ సమితి కమిటీ సభ్యులు అనంతల ఆంజనేయులు. గార్లపాటి శ్రీనివాసరెడ్డి. నడిగూడెం గ్రామ శాఖ అధ్యక్షుడు బోనగిరి ఉపేందర్. ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు దాసరి శ్రీనివాస్. మండల ఉపాధ్యక్షులు జొన్న రవి. మాజీ సర్పంచ్ దున్న సుధాకర్. పోలంపల్లి వెంకటేశ్వర్లు. నీలకంఠం వెంకన్న.నల్లమదా నాగేశ్వర్రావు మండల మాజీ కోఆప్షన్ ఎస్కే జలిల్.మండల ఉద్యమ నాయకులు దున్న ప్రవీణ్.రఫీ. మైనార్టీ నాయకులు ఎస్.కె మౌలానా. ఎస్కే గౌస్. నక్క సైదులు. డాక్టర్ సైదులు. చిత్తలూరి రవి. కంబంపాటి నాగేశ్వరరావు.. ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## నిరుపేదలకు వరమైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు

**గ్రామ సర్పంచ్ కొమ్ము రవి**



**చేర్యాల అక్షిత ప్రతినిధి:** మండలంలోని ఆకునూరు గ్రామానికి చెందిన తలకొక్కుల కిస్టయ్య కుమారుడు వెంకన్నకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు సాంక్షన్ అయినందున, గురువారం గ్రామ సర్పంచ్ కొమ్ము రవి ఆధ్వర్యంలో తలకోకుల వెంకన్నకు 30,000 వేల రూపాయలచెక్కును అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం అందిస్తున్న సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు నిరుపేద కుటుంబాలకు వరం లాంటిదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ డైరెక్టర్ జంబుల వెంకట్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అందె నానిబాబు, వార్డు సభ్యులు ఎండి అహ్మద్, భూమని భాస్కర్, మరియు గ్రామ నాయకులు రణం శ్రీకాంత్, ఉడుత ఐలయ్య, కొంక వెంకటేష్, జహీంగీర్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## విలేకరుల బాగోగులు పట్టించుకునే తీరిక మంత్రి జూపల్లి కృష్ణారావు కు లేదు...

**మంత్రి జూపల్లి స్వగ్రామం గ్రామం పెద్దగడలో పర్యటించిన మాజీ శాసన సభ్యులు హర్ష వర్ధన్ రెడ్డి**



**చిన్నంబావి,అక్షిత న్యూస్:** చిన్నంబావి మండలం మంత్రి జూపల్లి స్వగ్రామం గ్రామం పెద్దదగడ లో మాజీ శాసనసభ్యులు హర్ష వర్ధన్ రెడ్డి పర్యటించి మాట్లాడుతూ... కొల్లాపూర్ కు ఏడు పర్యాయాలు ఎమ్మెల్యే గా మూడు పర్యాయాలు రాష్ట్ర మంత్రిగా కొనసాగుతున్న రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కు విలేకరుల బాగోగులు పట్టించు కోనే తీరిక లేదని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బి ఆర్ఎస్ పార్టీ నాయకులు బీరం హర్షవర్ధన్ రెడ్డి విమర్శించారు. చిన్నంబావి మండలంలో విలేకరుల ఇంటి నిర్మాణాలు నిలిచిపోయి విలేకరులు ఆర్థిక ఇబ్బందులు పడు తున్నారు అని అన్నారు. విలేకరుల బాగోగులు పట్టించు కోనే తీరిక మంత్రి జూపల్లి కృష్ణారావు కు లేదని ఆయన కు తన సొంత ఎజెండా ఉందని ఆ ఎజెండా ద్వార తాను తన వర్గీయులు లాభ పడటం కొరకే కృష్ణారావు పనిచేస్తుంటారని విమర్శించారు. తనకు ఓట్లు వేసి గెలిపించిన ప్రజలు ఇప్పుడు ఏం చేస్తారు లే మళ్లీ 5 ఏళ్ల తర్వాత కదా ప్రజలతో పని , అప్పుడు వెళ్లి మళ్లీ మాయ మాటలు చెప్పి ప్రజలను మోసం చేయొచ్చనే దుర్మార్గమైన ఆలోచనలో మంత్రి జూపల్లి కృష్ణారావు ఉన్నారని బీరం హర్షవర్ధన్ రెడ్డి విమర్శించారు. చిన్నంబావి మండల కేంద్రం లో ఇండ్ల నిర్మాణాల కొరకు విలేకరులు బయట అప్పులు తెచ్చి ఇండ్లు నిర్మించుకుంటుంటే అట్టి ఇంటి నిర్మాణాలు అర్ధాంతరం గా నిలిచిపోయాయి అని అట్టి ఇంటి నిర్మాణాలను పూర్తి చేయించి విలేకరులకు మేలు చేయాలనే సోయి మంచితనం మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఏమాత్రం లేదని కొల్లాపూర్ మాజీ శాసనసభ్యులు బీరం హర్ష వర్ధన్ రెడ్డి విమర్శించారు.

# నర్సరీలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకొని లైసెన్స్ పొందాలి

**జిల్లా ఉద్యాన అధికారి జి. రాజ్ కుమార్**



**గద్వాల అక్షిత న్యూస్:** జిల్లాలోని వివిధ మండలాల్లో 30 కూరగాయల నర్సరీలు ఉన్నాయని, ప్రతి నర్సరీ తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకొని లైసెన్స్ పొందాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి జి.రాజ్ కుమార్ సూచించారు. గురువారం గద్వాల మండల కేంద్రంలోని పలు కూరగాయల నర్సరీలను ఆయన పరిశీలించారు. నర్సరీల నిర్వహణ,మొక్కల నాణ్యత,రిజిస్ట్రేషన్,లైసెన్స్ తదితర అంశాలను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

నిబంధనలు పాటించకుండా నర్సరీలను నిర్వహిస్తే ఉద్యాన నర్సరీల రిజిస్ట్రేషన్ మరియు క్రమబద్ధీకరణ చట్టం--2010 (చట్టము13 ఆఫ్ 2010), తెలంగాణ ఉద్యాన నర్సరీల రిజిస్ట్రేషన్ రూల్స్--2017 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొన్ని నర్సరీలు ప్రభుత్వ అనుమతి, రిజిస్ట్రేషన్ లేకుండా నాసిరకం నారు,మొక్కలను విక్రయిస్తున్నట్లు, రైతులకు బిల్లులు ఇవ్వడం లేదని తమ దృష్టికి వచ్చిందన్నారు.

ఇలాంటి నర్సరీలపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.రైతులకు నాణ్యమైన, ఆరోగ్యకరమైన,చీడపీడలు లేని కూరగాయల నారు,పండ్లు,పూల మొక్కలను అందించడమే నర్సరీ చట్టం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు.

కూరగాయల నారును సాంప్రదాయ పద్ధతిలో కాకుండా షేడ్‌నెట్ నర్సరీలు, ప్రోట్రేలలో శాస్త్రీయ పద్ధతుల్లో ఉత్పత్తి చేసి రైతులకు అందించాలని సూచించారు.మొక్కల నాణ్యత, పరిమాణం మరియు ప్రమాణాలకు అనుగుణంగా ధర నిర్ణయించడం, నాణ్యమైన తల్లి మొక్కలను నిర్వహించడం కూడా చట్టం ముఖ్య ఉద్దేశ్యాల్లో భాగమన్నారు.

నర్సరీ రిజిస్ట్రేషన్ కోసం నర్సరీ పూర్తి చిరునామా,దరఖాస్తుదారుని ఫోటో,భూమి పత్రాలు/పట్టాదారు పాస్‌బుక్/లీజ్ అగ్రిమెంట్, ప్రభుత్వ గుర్తింపు పొందిన సర్వేయర్ ద్వారా రూపొందించిన లేఅవుట్ మ్యాప్, నర్సరీలోని వసతుల వివరాలు, భూసార మరియు నీటి నాణ్యత పరీక్ష నివేదికలు, గత మూడు సంవత్సరాల మొక్కల ఉత్పత్తి వివరాలు,నర్సరీ డిజిటల్ ఫోటోగ్రాఫ్,రిజిస్ట్రేషన్ రుసుము చెల్లించిన రశీదు తదితర పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని రాజ్ కుమార్ తెలిపారు.

రైతులు మొక్కలు,నారు కొనుగోలు చేసే సమయంలో రిజిస్ట్రేషన్ మరియు లైసెన్స్ కలిగిన నర్సరీల నుంచే కొనుగోలు చేసి తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని జిల్లా ఉద్యాన అధికారి సూచించారు.

ఈ కార్యక్రమంలో గద్వాల ఉద్యాన అధికారి ఎం.రాజశేఖర్,నర్సరీ నిర్వాహకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## విలేమూన్ చౌరస్తాకు ఏకగ్రీవ తీర్మానం

**కౌన్సిలర్ ఇర్షాద్‌కు విలేమూన్ హైస్కూల్ ఓల్డ్ స్టూడెంట్స్ ఘన సన్మానం**





**తాండూరు అక్షిత ప్రతినిధి:** మున్సిపల్ పరిధిలోని 7వ వార్డులో విలేమూన్ స్కూల్ సమీపంలోని చౌరస్తాకు లిలి'విలేమూన్ చౌరస్తా'లిలిగా పేరు ఖరారు చేస్తూ, మున్సిపల్ కౌన్సిల్, సమావేశంలో సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించడం పట్ల విలేమూన్ హైస్కూల్ ఓల్డ్ స్టూడెంట్స్ హర్షం వ్యక్తం చేశారు.

చౌరస్తాకు పాఠశాల పేరు ఖరారు చేయడంలో కీలక పాత్ర పోషించిన 7వ వార్డు కౌన్సిలర్ షేక్ ఇర్షాద్ అహ్మద్,ను గురువారం పాఠశాల , ఓల్డ్ స్టూడెంట్స్ ఘనంగా , సన్మానించారు. పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో కౌన్సిలర్ ఇర్షాద్‌ను పూలమాలలు, శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా , ఓల్డ్ స్టూడెంట్స్ మాట్లాడుతూ.. తమ పాఠశాల పేరును చౌరస్తాకు పెట్టేలా కృషి చేసి, కౌన్సిల్‌లో తీర్మానం ఆమోదానికి సహకరించిన కౌన్సిలర్ ఇర్షాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల పేరుతో చౌరస్తా ఏర్పాటు కావడం తమకు ఎంతో సంతోషంగా ఉందని, పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో, జిల్లా లే లీడర్ ఏసు దాసు, ఏవి. మోజస్, ఎం. ఆనందం, పి. ధనం రాజు , జి. కవి జీవన్ కుమార్, రవికుమార్, టి. రవికుమార్, ఈ. బెన్హూర్, టి. ప్రభాకర్, రాజు, టీ. ఆశీర్వాదం, విలమున్ హై స్కూల్ విద్యార్థులు, పాఠశాల యజమాన్యం, దితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలనకు వెయ్యి రోజులు రోజులు

**మునగాలలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ**



**అక్షిత న్యూస్ మునగాల:** రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా టీపీసీసీ పిలుపుమేరకు మునగాల మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ సంబరాలు నిర్వహించారు. రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య కోదాడ ఎమ్మెల్యే శ్రీమతి ఉత్తమ్ పద్మావతి రెడ్డి ఆదేశాల మేరకు కార్యక్రమాలను చేపట్టారు.

మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి గణపవరం ఎక్స్‌రోడ్డు వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు అనంతరం పార్టీ కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించి కార్యాలయంలో సమావేశం నిర్వహించారుకాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాసర్ల కోటేశ్వరరావుకాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నల్లపాటి శ్రీనివాస్శ్రీబ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పోలిశెట్టి బుచ్చిబాబయ్యకాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి వేనిపల్లి వీరబాబు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లేపల్లి వెంకటేశ్వర్లు మునగాల గ్రామ శాఖ అధ్యక్షుడు కొమ్ము వీధరావుతో పాటు వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు, కార్యదర్శులుకార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.